

ఎసిబి వలలో బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్

రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి



సబ్‌రిజిస్ట్రార్‌ను విచారిస్తున్న ఎసిబి అధికారులు

ప్రజాశక్తి-బుక్కపట్నం

బుక్కపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయంపై బుధవారం సాయంత్రం ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. ఓ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సబ్ రిజిస్ట్రార్ శీనానాయక్ లంచం తీసుకుంటూ ఉండగా ఆయన్ను పట్టుకుని, అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు... పుట్టపర్తి మండలంకు చెందిన లింగాల సురేందర్ రెడ్డి అనే వ్యక్తికి సంబంధించి అన్నదమ్ముల విభాగ దస్తావేజుల కోసం సబ్‌రిజిస్ట్రార్‌ను ఈ ఏడాది మార్చి నెలలో సంప్రదించాడు. అప్పట్లో ఇందుకోసం లంచం ఇవ్వాలంటూ డాక్యుమెంట్ రైటర్ శ్రీహరి ద్వారా సబ్‌రిజిస్ట్రార్ డిమాండ్ చేశారు. ఈనెల 16వ తేదీన శ్రీహరి ద్వారా 50వేల రూపాయలు లంచం రూపంగా ఇస్తే రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పాడు. ఈ విషయంపై లింగాల సురేందర్ రెడ్డి మంగళవారం నాడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు బుధవారం సాయంత్రం రూ.10 వేలను డాక్యుమెంటరీ శ్రీహరికి ఇచ్చేలా ఎసిబి అధికారులు సూచించారు. ఈ మేరకు శ్రీహరి చేతికి రూ.10 వేలను సురేంధర్‌రెడ్డి ఇస్తుండగా అక్కడే ఉన్న ఎసిబి అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. శ్రీహరిని విచారించగా సబ్ రిజిస్ట్రార్ శీనానాయక్ పేరును చెప్పారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్ శీనానాయక్‌ను ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తు న్నారు. ఈ దాడుల్లో ఏసీబీ సిఐలు శాంతిలాల్, శివ గంగాధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పారిపోయిన సబ్‌రిజిస్ట్రార్

ఎసిబి అధికారులు విచారణ జరుపుతుండగా సబ్‌రిజిస్ట్రార్ శీనానాయక్ అధికారుల కళ్లుగప్పి పారిపోయాడు. సాయంత్రం కార్యాలయంలో విచారణ జరుపుతున్న సమయంలో బాత్‌రూంకు వెళ్లోస్తానని అనుమతి తీసుకుని బయటకు వెళ్లాడు. వెళ్లిన వ్యక్తి అటునుంచి అటే పారిపోయాడు. ఆయన పారిపోయినట్లు గుర్తించిన ఎసిబి అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.

సంబరంగా 'సత్యసాయి' స్నాతకోత్సవం



- ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరు
- 21 మందికి బంగారు పతకాలు
- 500 మందికి డిగ్రీ, పీజీ పట్టాలు ప్రదానం



బంగారు పతకాలు, పట్టాలు సాధించిన విద్యార్థులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి ఉషశ్రీ

500 మందికి డిగ్రీలు ప్రదానం

42వ స్నాతకోత్సవం సందర్భంగా 14 మందికి పిహెచ్‌డిలు, 500 మందికి డిగ్రీలు, పీజీ పట్టాలను ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 21 మందికి బంగారు పతకాలను రాష్ట్రపతి చేతుల మీదుగా అందించారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్శిటీ 42వ స్నాతకోత్సవ వేడుకలు బుధవారం నాడు సంబరంగా జరిగాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరవగా, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అతిథిగా హాజరయ్యారు. ఇద్దరు ప్రముఖులు రావడంతో పుట్టపర్తిలో సందడి వాతావరణం నెలకొంది. సత్యసాయిబాబా జయంతికి ఒక రోజు ముందు స్నాతకోత్సవం జరగడం అనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా గురువారం నాడు 98వ జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం నాడు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ వేడుకలు జరిగాయి. సాయిహీరా గ్లోబల్ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ వేడుకలు ఎంతో క్రమశిక్షణతో సాగాయి. ప్రారంభోత్సవానికి ముందు విద్యార్థులు వాయించిన బ్యాండ్ అందరినీ ఆకట్టుకుంది. అనంతరం స్నాతకోత్సవాన్ని ఛాన్సలర్ కృష్ణమాచారి చక్రవర్తి ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలో కొనసాగుతున్న కార్యకలాపాల గురించి వైస్ ఛాన్సలరు రాఘవేంద్ర ప్రసాద్ వివరించారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



గవర్నర్ అబ్దుల్ నజీర్

సత్యసాయి సేవలు అభినందనీయం : రాష్ట్రపతి

ప్రపంచ ఆధ్మాత్మిక కేంద్రంగానున్న పుట్టపర్తిలో సమగ్రమైన విద్యను సత్యసాయి ట్రస్టు ద్వారా అందిస్తుండటం అభినందనీయమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. 'సత్యం వద... ధర్మం చర' అన్న నినాదాన్ని సత్యసాయిబాబా ప్రకటించినట్టుగానే... ప్రతి ఒక్కరూ సత్యాన్ని పాటించి, ధర్మాన్ని ఆచరించాలని సూచించారు. మహాత్మాగాంధీ కూడా సత్యశోధన ప్రాధాన్యతను ఎప్పుడూ చెప్పేవారని గుర్తు చేశారు. ఉన్నతమైన విద్యా విజ్ఞానాన్ని అందించేదే కాకుండా సమాజ పునర్ నిర్మాణంలో ఎంతో కీలకమని చెప్పారు. నైతిక విలువలు, జీవన విలువలను విద్య అందిస్తుందన్నారు. బాబా బోధించిన మాన వతా విలువలు ఆధ్యాత్మికత కలగలిపి ఆధునిక విజ్ఞానాన్ని అందించేందుకు చక్కటి విద్యాసంస్థలను పుట్టపర్తిలో నెలకొల్పా లన్నారు. మానవతా విలువలు ఆధ్యాత్మికత శాస్త్ర సాంకేతిక అంశాలతో కూడిన సమ్మిళిత విద్యను బోధిస్తూ అద్భుతమైన ఫలితాలతో ప్రపంచంలోనే మేటి విద్యాసంస్థల సరసన సత్యసాయి విద్యా సంస్థలు విలువలకు నిలయాలుగా నిలిచాయన్నారు. సత్యసాయి ప్రజలకు వైద్య, విద్య, మంచినీరు వంటి ఎన్నో సేవలు అందించారన్నారు. భగవాన్ సత్యసాయిబాబా సేవలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు వారి అడుగుజాడలలో నడవాలని సూచించారు. ఈ ప్రాంతాన్ని సందర్శించి, బాబా మహాసమాధిని సందర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

ప్రాచీన గురుకుల విద్య తరహాలో ఇక్కడి విద్య : గవర్నర్

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ మన ప్రాచీన ఆధ్యాత్మిక సంపద ఎంతో విలువైనదని చెప్పారు. ప్రాచీన గురుకుల విద్య తరహాలోనే సత్యసాయి విద్యా సంస్థల్లోనూ విద్యను అందించడం ముదావాహ మన్నారు. లోక సమస్త సుఖీనోభవంతు' అని వేదాల్లో చెప్పినట్టుగా మన ప్రాచీనపరంపర శాంతి, సౌభ్రాతృ త్వాలను కోరుకుంటుందని పేర్కొన్నారు. 'విద్యా దదాతి వినయం... వినయాద్యాతి పాత్రతాం' అని చెప్పినట్టుగా విద్య ద్వారా వినయం.. వినయం ద్వారా అర్హత.. అర్హత ద్వారా సంపద అన్నీ వస్తాయని పేర్కొన్నారు. సమగ్రమైన విద్యను పొందడం ద్వారా విజ్ఞానం పొందడమే కాకుండా సమాజాభివృద్ధికి తోడ్పడినవార మవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, సెంట్రల్ ట్రస్టు సభ్యులు ఎస్.నాగానంద్ పాల్గొన్నారు.



ప్రతిభకనబరిచిన విద్యార్థికి బంగారుపతకం వేస్తున్న రాష్ట్రపతి

రాష్ట్రపతికి ఘన స్వాగతం



ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

పుట్టపర్తి రూరల్: శ్రీసత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు శ్రీసత్యసాయి విమానాశ్రయంలో బుధవారం మధ్యాహ్నం ఘన స్వాగతం లభించింది. ఒడిశాలోని జహర్సుగూడ విమానాశ్రయం నుంచి బయలుదేరిన రాష్ట్రపతి మధ్యాహ్నం 2-47.గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు .రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర స్త్రీ శివు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్ , ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, బోయ గిరిజమ్మ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, అడిషనల్ డిజిపి లాఅండ్ఆర్డర్ విజయవాడ డా॥శంఖబ్రరత బగ్చి, పుట్టపర్తి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, హిందూపురం పార్లమెంట్ సభ్యులు గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీలు షేక్ మొహమ్మద్ ఇక్బాల్, ఎస్.మంగమ్మ, భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, డా॥ఎం.తిప్పేస్వామి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబులపతి తదితరులు రాష్ట్రపతికి పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జరిగే స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొన్నారు.

కార్మికుడు చావుబతుకుల్లో ఉన్నా కనికరించరా..?



టాప్ ఇన్స్‌పెక్టర్‌ను ప్రశ్నిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ వాల్వ్ ఆపరేటర్ గోపాల్ రెడ్డి గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈయన్ను పరామర్శించి, చికిత్సకు అవసరమయ్యే సహకారం అందించాల్సిన ఆ శాఖ అధికారులు ఇందుకు విరుద్ధంగా కార్మికుడు హాజరుపట్టికలో ఆబ్సెంట్ మార్కు వేసి కార్మికులపై వారికి ఏపాటి ప్రేమ ఉన్నదో చాటుకున్నారు. కార్మికునికి హాజరుపట్టికలో గైర్హాజరు వేయడాన్ని నిరసిస్తూ కార్పొరేషన్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో మున్సిపల్ ఉద్యోగ కార్మిక యూనియన్ నాయకులు మల్లికార్జున, సంజీవరాయుడు మాట్లాడుతూ టాప్ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషాను నిలదీశారు. గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుని పట్ల ఇలా వ్యవహరించడం సరికాదంటూ అధికారికి తెలిపారు. కార్పొరేషన్‌లో వర్కర్ ప్రమాదాలకు గురైనా, మరణించినా అధికారులు ఎవరూ స్పందించడం లేదన్నారు. ఆ కుటుంబానికి ఒక్క పైసా కూడా సాయం చేసిన దాఖలాలు లేవన్నారు. తోటి వర్కర్లే తలా కొంత మొత్తాన్ని పోగుచేసి కార్మిక కుటుంబానికి అండగా నిలుస్తున్నామన్నారు. సహాయం చేయకపోతే పర్వాలేదు కానీ ఇలా కార్మికుడు మరింత ఇబ్బంది పడేలా కక్షపూరితంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు. కోర్టు కేసుల్లో ఉండి నెలల తరబడి ఉద్యోగాలకు రాకున్నా వారికి హాజరు వేసి, అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కార్మికునికి గైర్హాజరు వేయడం అత్యంత దుర్మార్గం అన్నారు. విధులు పట్ల అంకితభావంతో పని చేసే గోపాల్‌రెడ్డి లాంటి కార్మికుని అండగా నిలవాలని హితవు పలికారు. కార్మికుల ఆందోళన సమయంలో వాటర్ వర్క్స్ డిఈఈ సుభాష్ అక్కడికి చేరుకుని కార్మికులకు సర్దిచెప్పారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపాల్ రెడ్డికి పది రోజులకు హాజరు వేసేలా ఆయన ఒప్పుకున్నారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు.

ఎస్‌కెయులో వైఎస్ విగ్రహం ఎందుకు.? : సిపిఎం

అనంతపురం కలెక్టరేట్ : ఎస్‌కె.యూనివర్సిటీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటో ప్రభుత్వం జవాబు చెప్పాలని సిపిఎం ప్రశ్నించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని భావాలకు, ఆలోచనలకు నిలయంగా ఉండాల్సిన యూనివర్సిటీని వివాధాలకు కేంద్రంగా విసి మారుస్తున్నారని తెలిపారు. గతంలో మృత్యుంజయ యాగం చేయాలని ప్రయత్నించడం, ఇప్పుడు రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడం ఏ ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. స్ఫూర్తి ప్రదాతలుగా ఉండే మేధావులు, జాతీయోద్యమ నాయకులు, సంఘసేవకుల విగ్రహాలు ఏర్పాటు చేస్తే విద్యార్థులు, యూనివర్సిటీకి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. వందలాది అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నా, కొన్ని విభాగాల్లో ఒక్క విద్యార్థి చేరకపోయినా స్పందించని వైస్ ఛాన్సలర్ విద్యాయేతర కార్యక్రమాలకు అతిగా ప్రాధాన్యత ఇవ్వడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో తెలియజేయాలన్నారు. యూనివర్సిటీలో కనీస ప్రజాస్వామ్య పరిస్థితులు కూడా లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులతో చర్చించి యూనివర్సిటీ అభివద్ధికి కషి చేయాల్సిన విసి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయన్నారు. యూనివర్సిటీ సమస్యల పరిష్కారం కోసం కషి చేయాల్సిన ఎంపీ, ఎమ్మెల్యేలు రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మాత్రం సిద్ధం కావడం సరికాదన్నారు. అన్నింటినీ తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడాన్ని జిల్లా ప్రజలు హర్షించరన్న విషయాన్ని వారు గుర్తించాలన్నారు.

మండల స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం : కలెక్టర్



అర్జీదారుని సమస్యను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల స్థాయిలోనే ప్రజల సమస్యల పరిష్కారం కోసం జగన్నకు చెబుదాం స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని మండలాల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. బొమ్మనహాల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కళ్యాణదుర్గం ఆర్డీవో రాణి సుస్మితతో కలిసి 70 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో వచ్చిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ అర్జీలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్య ప్రజల జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మండల స్థాయిలో ఏర్పాటు చేసి జిల్లా స్థాయి అధికారులు అందరూ హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఎలాంటి ఆలస్యం లేకుండా ఆయాశాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, డిఎస్ఓ శోభారాణి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ్, డిఎంహెచ్ఓ డా॥ఈబి.దేవితో పాటు వివిధ శాఖల జిల్లా మండల అధికారులు పాల్గొన్నారు.

జిందాల్ సా ఫ్యాక్టరీ పరిశీలన

బొమ్మనహాల్ మండలంలోని హరేసముద్రం గ్రామం వద్దనున్న జిందాల్ సా లిమిటెడ్ ఫ్యాక్టరీని కలెక్టర్ ఎం.గౌతమి పరిశీలించారు. ఫ్యాక్టరీలోని పవర్ ప్లాంట్, బ్లాస్ట్ పర్మస్, డిటి ప్లాంట్, తదితర విభాగాలను పరిశీలించారు.

రూ. 5 లక్షల చెక్కు అందజేత



వాలంటీర్ కుటుంబానికి చెక్కు అందిస్తున్నఎమ్మెల్యే

అనంతపురం : అనారోగ్యంతో మృతిచెందిన వాలంటీర్ జహరాబి కుటుంబానికి బుధవారం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి రూ. 5 లక్షల చెక్కు అందజేశారు. వివరాలు.. నగరంలోని శారదానగర్‌కు చెందిన జహరాబి 42వ సచివాలయం పరిధిలో వాలంటీర్‌గా పని చేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఈ విషయాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఆయన రూ. 5లక్షలు మంజూరు చేశారు. ఆ చెక్కును ఎమ్మెల్యే వాలంటీర్ జహరాబి కుటుంబసభ్యులకు అందజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హరిత, వైసిపి నేత జయరాంనాయుడు, గోవింద్, పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని 31వ వార్డు మస్తాన్‌పేట, భాగ్యనగర్ కాలనీల్లో ప్రజల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు కోరారు. ఆ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 31వ వార్డులో రోడ్లు, మురికి కాలువలు, కల్వర్టులు, తాగునీటి పైపులైన్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుచోట్ల రోడ్లు, కాలువ లు శిథిలమై ఉండడంతో వర్షాకాలంలో మురుగు నీరు రోడ్లపైకి చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. ఆయా సమస్యలపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇకనైనా వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జాకీర్ హుస్సేన్, ఎన్.రామునాయక్, ఆర్.వీరేష్, ఎస్.షాషావలి, సి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

రచయిత శాంతినారాయణ ఎందరికో స్ఫూర్తి

ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

సుప్రసిద్ధ కథ, నవలా రచయిత అయిన డాక్టర్ శాంతినారాయణ ఎందరికో స్ఫూర్తి అని ఆచార్య రాచపా లెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం శుభ భారతి సౌజన్యంతో రాచపాలెం అధ్యక్షతన రచయిత డాక్టర్ శాంతినారాయణ రాసిన 'సాధన' నవల పరిచయ సభ నిర్వహించారు. రాచపాలెం మాట్లాడుతూ సాహిత్యం ద్వారా మనిషిలో సంస్కారం, చైతన్యం పెరుగుతాయన్నారు. శాంతి నారాయణ నేటి గ్రామీణ పేద విద్యార్థులకు గొప్ప స్ఫూర్తి అన్నారు. ముఖ్యఅతిథిగా వైస్ ప్రిన్సిపల్ శశాంకమౌళి, విశిష్ట అతిథిగా తెలుగు శాఖాధిపతి విజయకుమార్, గౌరవ అతిథిగా రచయిత ఒంకారుల స్వామి, ప్రధాన వక్తగా నాగేశ్వరాచారి హాజరై శాంతినారాయణ సేవలను కొనియాడారు.

నాటి కుగ్రామం.. నేటి జిల్లా కేంద్రం..!

- సత్యసాయి కేంద్రంగా పుట్టపర్తికి ప్రపంచస్థాయి గుర్తింపు
- బస్సేలేని ప్రాంతానికి విమానాలు
- పర్యాటకంగానూ అభివృద్ధి
- నేడు సత్యసాయి 98వ జయంతి వేడుకలు
- ముస్తాబైన పుట్టపర్తి




పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఒకనాటి కుగ్రామమైన పుట్టపర్తి నేడు జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందింది. స్వాతంత్రం వచ్చిన 15 ఏళ్లకు పుట్టపర్తి గ్రామానికి విద్యుత్ సౌకర్యం ఏర్పడింది. అప్పట్లో పెంకుటిళ్లు, పూరిళ్లలో ఇక్కడి ప్రజలు నివసించేవారు. శ్రీసత్యసాయి బాబా పుట్టపర్తికి రావడంతో ఈ ప్రాంతం స్వరూపమే మారిపోయింది. ఒకప్పుడు బస్సే లేని ఈ గ్రామానికి నేడు విమానాలు వస్తున్నాయంటే ఈ ప్రాంతం ఎలా మారిపోయిందో అర్థం చేసుకోవచ్చు. సత్యసాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ నుంచి అన్ని నగరాలకూ రైల్వే సౌకర్యం ఏర్పడింది. కుగ్రామమైన పుట్టపర్తి నేడు అంచలంచెలుగా ఎదిగి సత్యసాయి జిల్లా కేంద్రంగా ఏర్పడింది. పుట్టపర్తి జిల్లా కేంద్రం చేయడం ద్వారా ఈ ప్రాంతం మరింత అభివద్ధి చెందే అవకాశాలు ఏర్పడ్డాయి. జిల్లాకేంద్రంగా ఏర్పడిన తరువాత ప్రభుత్వ కార్యాలయాలకు ఇబ్బంది లేకుండా సత్యసాయి ట్రస్టు వారి ఆధీనంలో ఉన్న భవనాలను కార్యాలయాల కోసం అప్పగించింది. దీంతో కొత్త జిల్లా అయినప్పటికీ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పాలన పరంగా అధికారులకు విధుల నిర్వహణ సులభతరం అయింది.

నేడు బాబా జయంతి ఉత్సవాలు



శ్రీసత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలు గురువారం నాడు ప్రశాంతి నిలయంలో వైభవంగా జరగనున్నాయి. వేడుకల నిర్వహణ ఏర్పాట్లను ఇప్పటికే సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో పూర్తి చేశారు. వేడుకల్లో పాల్గొనడానికి దేశ విదేశీ భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఇప్పటికే పుట్టపర్తికి చేరుకున్నారు. పుట్టపర్తి మొత్తం ప్రత్యేక అలంకరణతో ముస్తాబు అయ్యింది. ప్రతి ఏడాది సత్యసాయి జయంతి ఉత్సవాలను ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే గురువారం నాడు ఈ వేడుకలు జరగనున్నాయి.

బాబా రాకతో మారిన పుట్టపర్తి రూపరేఖలు

1925 నవంబర్ 23న పుట్టపర్తిలో పెద్ద వెంకమ్మ రాజు, ఈశ్వరమ్మ దంపతులకు సత్యనారాయణ రాజు జన్మించారు. తన 15 ఏట సత్యనారాయణ రాజు తాను సత్యసాయిబాబా అని ప్రకటించుకున్నారు. అప్పట్లో చిన్న గుడిలా ఉన్న ఆయన నివాసం సత్య సాయిబాబాగా అవతరించిన తరువాత ప్రశాంతి నిలయంగా మారింది. ఇక్కడకు దేశ విదేశాలకు చెందిన పర్యాటకులు, భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. దాదాపు 180 దేశాల్లో సత్యసాయి సేవా సమితులు ఏర్పడ్డాయి. సత్యసాయి ట్రస్టును ఏర్పాటు చేసి పలుసేవా కార్యక్రమాలను చేపట్టారు. కరువు జిల్లా అయిన అనంతపురంలో తాగునీటి కోసం దాదాపు రూ.400 కోట్లు వెచ్చించి 1100 గ్రామాలకు తాగునీరు అందించిన ఘనత సత్యసాయికి దక్కుతుంది. ఈ జిల్లాలోనే కాక రాష్ట్రంలోని మరో ఎనిమిది జిల్లాలకు సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీరు అందించారు. ప్రకతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు సత్యసాయి సేవాసమితిల ఆధ్వర్యంలో సేవాదళ్ ఆ ప్రాంతాలకు వెళ్లి సేవా కార్యక్రమాలు చేపట్టేవారు. బాబా మరణానంతరం ట్రస్టు ఆధ్వర్యంలో అలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. బాబా తన తల్లి కోరిక మేరకు విద్య, వైద్యం సదుపాయాలను విస్తరించారు. ప్రధానంగా పుట్టపర్తిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసి ప్రపంచంలోనే అత్యంత అధునాత వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆస్పత్రిలో గుండె, కన్ను, ఆర్థోపెడిక్, తదితర రోగాలకు పూర్తిగా ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. పుట్టపర్తిలోని జనరల్ ఆసుపత్రిని నెలకొల్పి ఇక్కడా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారు. విద్యాభివృద్ధిలో భాగంగా పట్టపర్తిలో పలు విద్యాసంస్థలనూ ఏర్పాటు చేశారు. పుట్టపర్తితో పాటు అనంతపురం, కర్నాటక రాష్ట్రంలోని బందావన్‌లో కూడా సత్యసాయి విద్యా సంస్థలు ఉన్నాయి. ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్న విద్యాలయాలు దేశీయంగానూ ఎంతో ప్రాచుర్యం పొందాయి. పుట్టపర్తిలో రైల్వే స్టేషన్, విమానాశ్రయం కూడా ఉన్నాయి.

పర్యాటకంగానూ పుట్టపర్తి అభివృద్ధి

పుట్టపర్తిని పర్యాటకంగానూ అభివృద్ధి చేసేలా సత్యసాయి సెంట్రల్ ట్రస్టు చర్యలు తీసుకుంది. ఇటీవల పుట్టపర్తిలోని చిత్రావతి నదిలో బోట్ క్లబ్ ఏర్పాటు చేశారు. సత్యసాయి మహాసమాధి దర్శించుకోవడానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఈ బోటు క్లబ్ ఎంతో ఆహ్లాదకరంగా అలరిస్తోంది. సత్యసాయి సంస్థలు ఏర్పాటు చేసిన హిల్‌వ్యూ స్టేడియం సమీపాన వెలసిన చైతన్య జ్యోతి మ్యూజియం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. యూనివర్సిటీ వద్ద వెలసిన పురాతన మ్యూజియం సత్యసాయి బాబా జీవిత చరిత్ర గురించి పర్యాటకులకు అర్థమయ్యే విధంగా ఏర్పాటు చేశారు. చిత్రావతి ఒడ్డున వెలసిన పురాతన కల్పవక్షం అలరిస్తోంది. పెద్దపెద్ద నగరాల్లో ఉండే నక్షత్రశాలను పుట్టపర్తిలో ఏర్పాటు చేశారు. బుధవారం, శనివారం ఉచితంగా నక్షత్రశాల తిలకించడానికి ప్రవేశం ఉంటుంది. సత్యసాయి విద్యార్థులు వ్యాయామం చేసుకోవడానికి అనుకూలంగా హిల్ వ్యూ స్టేడియంతో పాటు ఇండోర్ స్టేడియంను నిర్మించారు. ఇక్కడ ప్రతి ఏటా జనవరి 11న సత్యసాయి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే సత్యసాయి జన్మదిన వేడుకలు నవంబర్ 23న వైభవంగా నిర్వహిస్తున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

వైసిపితోనే బడుగుల అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సిఎం జగన్‌తోనే సాధ్యమని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, మాజీ మ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. వజ్రకరూరు మండల పరిధిలోని రాగులపాడు సచివాలయంలో బుధవారం 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి విశ్వ తొలుత వైసిపి జెండా దిమ్మెను ప్రారంభించి జెండా ఎగురవేశారు. అనంతరం సచివాలయ ఆవరణలో వివిధ సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి వివరాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి బుక్‌లెట్‌లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయం-2 పరిధిలో ప్రజలకు రూ.32 కోట్ల లబ్ధి చేకూరినట్లు తెలిపారు. కార్యక్ర మంలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కొనకొండ్లలో ప్రజలకు వైసిపి బ్రోచర్ అందజేస్తున్న విశ్వ, వైసిపి నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సిఎం జగన్ పాలన చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. వజ్రకరూరు మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో విశ్వ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు విశ్వను గజమాలతో సత్కరించారు. అనంతరం ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, ఇఒఆర్‌డి సదాశివ, ఎంపిపి రమావత్‌దేవి, పార్టీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ సుధీర్‌రెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, నాయకులు వైద్యనాథ్‌రెడ్డి, ఉస్మాన్, ఎంఎల్‌ఒ తేజేశ్వర్‌రెడ్డి, ఖాజాపీరా, సామానాయక్, ప్యాపిలి కిష్టప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప : ఎంపిటిసిల సంఘం జిల్లా అధ్యక్షులు, ఎంపిపి పెద్దన్న ఆధ్వర్యంలో మండల పరిధిలోని తగుపర్తి గ్రామంలో 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైసిపి నాయకులు, కార్యకర్తలు కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పెద్దన్న మాట్లాడుతూ అవినీతికి తావు లేకుండా నేరుగా అర్హుల బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ము జమ చేసిన ఏకైక ప్రభుత్వం జగన్‌దే అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామచంద్ర, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, వైసిపి మండల కన్వీనర్, మచ్చన్న, వైస్ ఎంపిపి పుష్పావతి కె.గోపాల్, పి.శ్రీనివాసులు, దుద్దేకుంట రామాంజనేయులు, బి.శివలింగప్ప, శ్రీనివాసులు, కరుణాకర్, ఎస్.కె.ఎర్రిస్వామి, రామాంజనేయులు, బాబురెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు

పెద్దపప్పూరు : మండల పరిధిలోని చిక్కేపల్లి గ్రామంలో వైసిపి ఆధ్వర్యంలో 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత ప్రభుత్వానికి, జగన్ ప్రభుత్వానికి మధ్య తేడాను తెలిపి మరొకమారు వైసిపిని ఆదరించి కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, అశ్వర్థనారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ రెడ్డిరామేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కులగణనను గడువులోగా పూర్తి చేయాలి

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రభుత్వం ఆదేశించిన మేరకు కులగణన కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున, సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం కులగణనపై సచివాలయ కార్యదర్శులు, వార్డు వాలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించి సర్వేపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కులగణన ప్రక్రియను ఈ నెల 27 నుంచి వారం రోజుల్లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఆ మేరకు ప్రతి సచివాలయం కార్యదర్శులు, వాలంటీర్లు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి కుటుంబ పూర్తి వివరాలు తెలుసుకుని ఈ యాప్‌లో పొం దుపరచాలన్నారు. కులగణన సర్వేకు వచ్చిన వాలంటీర్లు, సచివాలయ కార్యదర్శులకు ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లావణ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాసిర్‌హుస్సేన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ అబ్దుల్ సత్తార్, మేనేజర్ రంగనాథం, సచివాలయాల కార్యదర్శులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లు : కులగణనపై సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ మల్లికార్జున

నార్పల : స్థానిక బాలికల పాఠశాలలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, గ్రామ వాలంటీర్లకు కులగుణనపై శిక్షణ తరగతులు నిర్వహించి, సర్వేపై అవగాహన కల్పించారు. ఎంపిడిఒ దివాకర్ మాట్లాడుతూ కులగణన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండాలన్నారు. ఈ ఓటింగ్ ఎక్కువ శాతం బయోమెట్రిక్ ద్వారానే నిర్వహించాలన్నారు. 8 ఏళ్ల లోపు పిల్లలు వేలిముద్ర వేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఒ అశోక్‌కుమార్‌రెడ్డి, తహవీల్దార్ హరికుమార్, సిఎస్‌డిటి రాజశేఖర్, ఎఎస్‌ఒ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని స్పెషల్ ఆఫీసర్ కుష్బూ కొఠారి, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వాలంటీర్లు, విఆర్‌ఒలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ మీరు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు ప్రజల వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీనిపై వారికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డిఎల్‌డిఒ ఓబుళమ్మ అధ్యక్షతన మండల పరిధిలోని కల్లూరు1, 2, 3, ఇల్లూరు, పెనకచర్ల, కేశవాపురం, కమలాపురం, ఎర్రగుంట్ల సచివాలయాల పరిధిలోని గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు కులగణన సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆర్థిక, సామాజిక, జీవనోపాధి సమతుల్యతపై అవగాహన కల్పిస్తామన్నారు. మీరు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర్, తహశీల్దార్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ రవి

జిల్లాకు చేరిన ఎరువులు

అనంతపురం: జిల్లాకు 2,725 మెట్రిక్ టన్నుల కోరమాండల్ ఫర్టిలైజర్ కంపెనీ ఎరువులు చేరాయని ఎడిఎ ఎం.రవి తెలిపారు. నగర శివారులోని ప్రసన్నాయపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు చేరిన ఎరువులను బుధవారం ఆయన పరిశీలించారు. అందులో 14:35:14.ఎరువులు 1504 మెట్రిక్ టన్నులు, 10:26:26.ఎరువులు 520 మెట్రిక్ టన్నులు, 20:20:0:13 ఎరువులు 701 మెట్రిక్ టన్నులు ఉన్నాయన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి, కలెక్టర్ సూచనల మేరకు గోదాములకు తరలిస్తామని ఆయన తెలిపారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

గుత్తి : సత్యసాయి జయంతి పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో శ్రీభగవాన్ సత్యసాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా 14 బ్రాహ్మణ కుటుంబాలకు వస్త్రదానం చేశారు. బాల వికాస్ పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సమితి మండల కన్వీనర్ ఎంవి. రమణ, సభ్యులు విశ్వనాథ్, రాజేంద్ర, భజన మండలి సభ్యులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యసాయి నగర సంకీర్తన

నార్పల : సత్యసాయి బాబా జయంతి సందర్భంగా భజన మండలి ఆధ్వర్యంలో గురువారం(నేడు) తెల్లవారుజా మున 5.30 నుంచి 6.30 గంటల మధ్య నగర సంకీర్తన నిర్వహిస్తున్నట్లు భజనమండలి మండల కన్వీనర్ సిద్ధవెంకటరమణ, సేవాదళ్ మండల కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర సంకీర్తన స్థానిక పాతబజార్‌లోని భజన మండలి కేంద్రం నుంచి ప్రారంభమై పాత పోలీస్‌స్టేషన్ వరకూ నిర్వహిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పుట్లూరు : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం అంగన్‌వాడీ సిబ్బంది సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి సరోజకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వేతనం పెంపు, గ్రాట్యూటీ, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌గా మార్పు, ప్రమోషన్స్, సర్వీసులో ఉండి చనిపోయిన సిబ్బంది కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, బీమా తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శి సరోజకు వినతిపత్రం అంగన్‌వాడీ సిబ్బంది

టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా బుధవారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జెసి అస్మిత్‌రెడ్డి మండల పరిధిలోని వరదాయపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తేనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని తెలిపారు. అలాగ ప్రజల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు టిడిపి నాయకులు, కార్యకర్తలు, జెసి అనుచరులు, అభిమానులు, పెద్దఎత్తున పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న జెసి అస్మిత్‌రెడ్డి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : 'దండు'

శింగనమల : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు పేర్కొన్నారు. దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల పరిధిలోని డబ్ల్యు. నరసాపు రం పంచాయతీ గురుగుంట్ల గ్రామంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కన్వీనర్ తోట ఓబులేసు, టిడిపి క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, బూత్ కన్వీనర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నకిలీ ఉత్పత్తులపై విజిలెన్స్ అధికారుల దాడులు

ప్రజాశక్తి-అనంతపురం

నకిలీ ఉత్పత్తులను సరఫరా చేసిన, అమ్మిన వారిపై చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెచ్చరించారు. వారు బుధవారం హిందూస్తాన్ యూనిలివర్ లిమిటెడ్‌కి చెందిన అన్వేష, ఐపిఆర్ సర్వీసెస్ అధీకృత వ్యక్తులతో కలిసి అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం పట్టణాల్లోని వివిధ నిత్యావసరాల హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నకిలీ ఉత్పత్తులను గుర్తించారు. అనంతపురం నగరంలో వివిఆర్ ట్రేడర్స్, శ్రీరాఘవేంద్ర జనరల్ స్టోర్స్, తాడిపత్రిలో శ్రీవెంకటేశ్వర జనరల్ స్టోర్స్, విఆర్, జనరల్ స్టోర్స్, ధర్మవరంలో రామిశెట్టి జనరల్ స్టోర్స్, క్రిష్ణ జనరల్ స్టోర్స్‌లలో రూ. 91,575 విలువ కలిగిన నకిలీ ఉత్పత్తులను సీజ్ చేశారు. ఆయా షాపుల యజమానులపై చర్యలకు సంబంధిత పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. తనిఖీల్లో సిఐలు శ్రీసాయిప్రసాద్, ఎం.రామారావు, డిఇఇ ఎస్.యోగేష్ బాబు, ఎఇఇలు ఎల్.రవీంద్రనాథ్, కుళ్లాయిరెడ్డి, డిసిటిఒ విజయలక్ష్మి, ఎఒ జె.వాసుప్రకాష్, హిందూస్తాన్ యూనిలివర్ లిమిటెడ్ సిబ్బంది పాల్గొన్నారు.



రిటైల్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కార్మికులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం

కార్మికులకు నిత్యం అందుబాటులో ఉంటూ, రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి టిఎన్‌టియుసి నూతన జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులుకు సూచించారు. టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులుగా నియమించినందుకు లక్ష్మీనరసింహులు బుధవారం నగరంలోని టిడిపి కార్యాలయంలో ప్రభాకర్‌చౌదరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ అనంతపురం పార్లమెంటు పరిధిలోని ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి, టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నాగభూషణం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్వప్న, నగర అధ్యక్షులు సిమెంటు పోలన్న, నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, నాయకులు సైపుద్దీన్, సంగా తేజస్విని, పూల బాషా, అజీజ్, జెఎం.బాషా, రఫిక్‌అహ్మద్, చిర్రాళ్ల రామాంజనేయులు, ముత్యాలు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోతుల లక్ష్మీనరసింహులు



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న దాత రేణుక

భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి-గార్లదిన్నె

స్థానిక జడ్పి హైస్కూల్‌లో దాతల సహకారంతో రూ. 65 లక్షల వ్యయంతో నిర్మించిన భోజనశాలను బుధవారం డిఎల్‌డిఒ ఓబుళమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నారై హనుమంతరావు, గౌరమ్మ జ్ఞాప కార్థం వారి మనవరాలు రేణుక భోజనశాల నిర్మాణానికి నిధులు ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ భోజనశాలలో 400 మంది విద్యార్థులు కూర్చుని భోజనం చేయవచ్చన్నారు. దాత రేణుక మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. భోజనశాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ్‌భాస్కర్, హెచ్‌ఎం సుంకన్న, సుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఈ నెల 23వ తేదీ సత్యసాయి జయంతి పురస్కరించుకొని బుధవారం వజ్రకరూరు కెజిబివి విద్యార్థినుల కు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ తెలిపారు. సత్యసాయి జయంతి రోజున 250 మందికి పాలు, పండ్లు, బ్రెడ్, పంపిణీ చేస్తామని, పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది వరలక్ష్మీ, అనంతలక్ష్మి మహాలక్ష్మి, చంద్రకళ, భార్గవి అశ్విని, రేష్మా, సావిత్రిబాయి, కవితాబాయి, పల్లవి పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ఇఒఆర్‌డికి నేడు సన్మానం

నార్పల : మండల ఇఒఆర్‌డిగా పని చేస్తున్న లక్ష్మీనరసింహ ఉద్యోగోన్నతిపై కుందుర్పి ఎంపిడిఒగా బదిలీపై వెళ్లారు. దీంతో గురువారం(నేడు) స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమక్షంలో సన్మానించనున్నట్లు ఎంపిడిఒ దివాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు

టిడిపి నేత మృతికి 'కాలవ' నివాళి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్‌లో బుధవారం టిడిపి నాయకుడు మైలాపురం ధనుంజయ(50) హఠాన్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాలం శ్రీనివాసులు ఆయన ఇంటికెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాలవ వెంట టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, నాయకులు మల్లికార్జున, కంచప్ప, అప్పారావు, పయ్యావుల అనిల్, సైకిల్ షాప్ హనుమంతు, సంగప్ప, తదితరులు ఉన్నారు.

రక్తదానంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-అనంతపురం

యువత రక్త దానంపై అవగాహన పెంచుకొని, ప్రతి 3 నెలలకూ ఓ సారి రక్తదానం చేయాలని ఐక్యరాజ్య సమితి అవార్డు గ్రహీత బిసాతి భరత్ సూచించారు. జాతీయ సమాఖ్య వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువకేంద్రం, ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో రాష్ట్రపతి అవార్డు గ్రహీత కె.జయమారుతి, రాఘవేంద్రయాదవ్, బి.పవన్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, రామకృష్ణ, స్ఫూర్తి సేవా సంస్థ సభ్యులు జయరామప్ప పాల్గొన్నారు. బిసాతి భరత్ మాట్లాడుతూ మనం ఇచ్చే ఒక యూనిట్ రక్తం ద్వారా మూడు ప్రాణాలు కాపాడగలమన్నారు. కావున యువత రక్తదానం చేయడంతో పాటు మిత్రులు, తోటి వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రం, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి పథం యూత్ అసోసియేషన్ కార్యదర్శి వై.పవన్, సభ్యులు తుకారాం, సంతోష్‌నాయక్, గణేష్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు నందిత, కీర్తి, స్వప్న, రెడ్ క్రాస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

ఎపిపి దంపతులపై కఠిన చర్యలు తీసుకోవాలి

సంఘటిత పోరుకు అఖిలపక్షం పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం

మైనార్టీ బాధిత బాలికకు న్యాయం చేయలేని అసమర్థ వైసిపి ప్రభుత్వంపై అఖిల పక్షం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం నగర అధ్యక్షులు పొదిలి బాబురావు అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించగా జనసేన, టిడిపి, కాంగ్రెస్, సిపిఎంతో పాటు పలు మైనార్టీ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దంపతులు అనాథ బాలికను కార్మిక నిబంధనలకు విరుద్ధంగా పనిలో పెట్టుకోవడమే కాక పైశాచికంగా దాడికి తెగబడడం దుర్మార్గపు చర్య అన్నారు. వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారిపై బార్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. ఎపిపి దంపతులను వెనకేసుకొస్తున్న ప్రభుత్వంపై సంఘటిత పోరుకు పిలుపునిచ్చారు. బాధితురాలికి న్యాయం జరిగేంత వరకూ అఖిలపక్షం పోరాడుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు రాపాక ధనంజయ, కిరణ్‌కుమార్, అవుకు విజయ్‌కుమార్, సిపిఎం నాయకులు రామిరెడ్డి, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, రొళ్ల భాస్కర్, హుస్సేన్, ధరాజ్‌బాషా, నగర కార్యదర్శులు కుమ్మర మురళి, అంజి, సంపత్, ఆకుల అశోక్, టిడిపి నాయకులు నరసింహులు, ముక్తార్, జెఎం బాషా, హఫీజ్, ప్రజా సంఘ నాయకులు జాకీర్ హుస్సేన్, సూద్ వలి, మసూద్ వలి, మహమ్మద్ షఫి, ముంతాజ్ బేగం, యాస్మిన్‌బాను, సరస్వతి, విజయ్, దేవా రాయల్, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.



అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారీ

ప్రజాశక్తి-రాయదుర్గం

ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కరుణ కుమారి సహాయ ఎన్నికల అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి సలహాలు, సూచనల మేరకు సమాచారం బదిలీ చేయాలన్నారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఇప్పటివరకూ 12,110 దరఖాస్తులు అందగా 11,381 అప్‌డేట్ చేయగా, 433 తిరస్కరించారని, 264 పెండింగులో ఉన్నాయన్నారు. తాత్కాలికంగా వలస వెళ్లిన వారి అంగీకారం లేనిదే ఓటరు జాబితా నుంచి తొలగించరాదన్నారు. ఓటరు జాబితాపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని బిఎల్‌ఒలను ఆదేశించారు. పట్టణ పరిధిలో ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణలను పర్యవేక్షించే బాధ్యత సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌దే అన్నారు. అందిన దరఖాస్తులపై ఎన్నికల సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో టిడిపి ప్రతినిధి నాగరాజు, సిపిఎం ప్రతినిధి బంగి శివ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఐదు మండలాల తహశీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇఆర్‌ఒ కరుణకుమారి

విద్యా పథకాల్లో కోత విధించేందుకే కొత్త నిబంధన

ప్రజాశక్తి-శింగనమల

విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు తల్లి, విద్యార్థికి ఉమ్మడిగా బ్యాంక్ ఖాతా ఉండాలన్న నిబంధనను రాష్ట్ర ప్రభుత్వం వేంటనే రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. శింగనమలలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ అకౌంట్ నిబంధన సాకుగా చూపి విద్యా దీవెన, వసతిదీవెనలను ఎగ్గొట్టాలని చూస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే 'విద్యాదీవెన'ను రెండేళ్లుగా అమలు చేయలదన్నారు. వసతి దీవెన రూ. 20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి రూ. 10 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. కొత్త నిబంధన వల్ల ప్రయోజనం లేకపోగా చాలా నష్టం జరుగుతుందన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాయింట్ అకౌంట్ నిబంధనను రద్దు చేయాలని, పెండింగ్లో ఉన్న రూ. 1600 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సమరశీల ఉద్యమాలకు పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మదన్‌మోహన్, మురళి, నాగమోహన్, తరుణ్‌కుమార్, నవీన్‌కుమార్, వర్ధన్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హెచ్ఐవిపై విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి-గుత్తి

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ఎపి బాలికల గురుకుల పాఠశాలలో హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవి/ఎయిడ్స్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టిఐ ప్రాజెక్టు మేనేజర్ జి.రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ వెంకటేష్ మాట్లాడుతూ హెచ్ఐవి సంక్రమణ, సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందుల గురించి వివరించారు. అనంతరం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నాగలక్ష్మి, హ్యాండ్స్ స్వచ్ఛంధ సంస్థ టిఐ ప్రాజెక్ట్ ఎంఇఎ సందీప్, ఎఎన్ఎం కవిత, ఒఆర్‌డబ్ల్యులు డి.కృష్ణవేణి, షేక్ శంషాద్, జి.రాధాకుమారి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : ప్రపంచ ఎయిడ్స్ మాసోత్సవం సందర్భంగా స్థానిక కెజిబివిలో హ్యాండ్స్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు మేనేజర్ రమేష్, సిబ్బంది సందీప్, జ్యోత్స్న, పాఠశాల ఆరోగ్య కార్యకర్త అరుణ తదితరులు హెచ్ఐవి సంక్రమించే విధానాలు, వాటి నివారణ మార్గాలు, జాగ్రత్తలు, మందులు తదితర అంశాలపై వివరించారు.



ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉరవకొండ

పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు మందులు సక్రమంగా వేసుకుంటే టిబిని నయం చేసుకోవచ్చని పాల్తూరు ప్రభుత్వ వైద్యాధికారిణి అరుణకుమారి, సర్పంచి బ్యాలారాణి రాజశేఖర్ తెలిపారు. విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో బుధవారం టిబి రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ టిబి రోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. టిబి రహిత సమాజం నిర్మించడంలో భాగంగా ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాల్లో టిబి వ్యాధి నిర్మూలన చర్యలు చేపట్టాయన్నారు. వైద్య సిబ్బంది టిబి సోకిన వారిని గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ఆ మందులను సక్రమంగా వేసుకుంటూ పౌష్టికాహారం తీసుకుంటే 6 నెలల్లోపు నయం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాకర్, కుళ్లాయమ్మ, నాగమ్మ, శ్రావణి, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

తాడిపత్రి రూరల్ మండల పరిధిలోని దిగుపల్లి గ్రామంలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు మొక్కజొన్న, మిరప పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రాంతీయ పరిశోధన స్థానం, నంద్యాల అధిపతి డాక్టర్ ఎన్సీ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడా రు. రైతులు కేవలం రసాయనిక మందుల ద్వారానే కాకుండా జీవ సంబంధిత మందులను ఉపయోగించాలని సూచించారు. మొక్కజొన్నలో కత్తెర, రెక్కల పురుగుల నివారణ, మిరపలో నల్లతామర నివారణ చర్యలను తెలిపారు. రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మాట్లాడుతూ మొక్కజొన్న విత్తిన 15 రోజుల నుంచి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని 50 రోజుల వరకు పంటను కాపాడగలిగితే ఆ తర్వాత ఇబ్బంది ఉండదని తెలిపారు. అనంతరం రైతులకు లింగాకర్షణ బుట్టలు అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల ప్రాంతీయ పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎన్సీ వెంకటేశ్వర్లు, డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ కిషోర్‌రెడ్డి, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి ప్రకాశ్, 45 మంది రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్నపై అవగాహన కల్పిస్తున్న అధికారులు